క్లుప్తంగా

జెడ్పీ బాలికల జూనియర్ కాలేజీ చేర్పించండి



విద్యార్థిని, తల్లితో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: పదవ తరగతి పాసైయిన విద్యార్థినులను స్థానిక జిల్లా పరిషత్ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ లో చేర్పించాలని ఎంఈఓ రవీంద్రనాథ్ కోరా రు. శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూలులో టెన్త్ పూర్తి చేసి, టీసీల కోసం వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. కాలేజీలో ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులను ప్రవేశపెట్టారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లెక్చరర్లు సురేంద్ర, రఘువీర్, మార్టిన్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు ఈ నెల 19 నుంచి ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ డాక్టర్ బి రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. బిఏ(చరిత్ర), బి.కామ్(కంప్యూటర్స్), బీఎస్సీలో ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ మైక్రో బయాలజీ కోర్సులు మూడేళ్ల కాలవ్యవధితో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన, మల్టీ డిసిప్లినరీ సబ్జెక్ట్, స్కిల్ డెవలప్‌మెంట్, లైఫ్ స్కిల్ కోర్సులు ప్రతి విద్యార్థిని తప్పక చదివే సబ్జెక్టుగా ఉంటుందన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని లేదా నేరుగా కళాశాలలోని కార్యాలయంలో సంప్రదించి రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. మరన్ని వివరాలకు 9441964145, 9248852999, 9491312865 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

తీరిన తాగునీటి సమస్య



తాగునీటి సమస్యను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరసింహరావు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కారణిమిట్టలోని జగనన్న కాలనీలో తాగునీటి కోసం బోరు వేసి, మోటారు బిగించి, పైపులైన్ వేయక పోవడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈ విషయం ఎంపీడీఓ డీవీ నరసింహరావు దృష్టికి రావడంతో శుక్రవారం ఆయన కాలనీకి వెళ్లి పరిశీలించారు. జగనన్న కాలనీకి బోరు మోటారు నుంచి పైపులైన్ వేయడానికి గ్రామపంచాయతీ నిధులను ఉపయోగించాలని గ్రామ కార్యదర్శి ఇందిరమ్మను ఆదేశించారు. దీంతో కాలనీలోని తాగునీటి సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన పీహెచ్‌సీ భవనాలను ప్రారంభిస్తాం

వరదయ్యపాళెం: సత్యవేడు నియోజకవర్గంలో నాడు–నేడు పథకం కింద చిన్న పాండూరు, నాగలాపురంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాలను త్వరలో ప్రారంభిస్తామని రోడ్లు భవనాల శాఖ ఈఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన నాగలాపురం, చిన్న పాండూరు నూతన పీహెచ్‌సీ భవనాలను పరిశీలించారు. దాదాపు వీటి నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయన్నారు. త్వరలో సంబంధిత వైద్య ఆరోగ్యశాఖకు భవనాలను అధికారికంగా అప్పగించి ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు అన్ని హంగులతో భవనాలను నిర్మించినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట డీఈలు శ్రీనివాసులు (శ్రీకాళహస్తి), అమరనాథరెడ్డి (పుత్తూరు),ఏఈ రాంబాబు ఉన్నారు.

వాహనాల తనిఖీ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ రాఘవేంద్ర హెచ్చరించారు. బుధవారం మండలంలోని రాజీవ్‌నగర్ సమీపంలోని మార్గంలో వాహనదారుల రికార్డులు పరిశీలించారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్, వాహనపత్రాలు కలిగి ఉండాలని, ట్రిపుల్ రైడింగ్ చేస్తే బైక్‌లను సీజ్ చేస్తామన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించిన ప్రయాణికులతో వెళ్లరాదన్నారు.

నేడు ప్రారంభోత్సవాలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్ ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో రూ.80లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, శుకబ్రహ్మాశ్రమం మార్గం వాటర్ హౌస్ కాలనీలో రూ.64.3లక్షలతో నిర్మించిన సన్నిధి వీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల భవనాలను శనివారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. గతంలో సన్నిధి వీధిలోని మున్సిపల్ స్కూల్‌ను ఆలయ మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించారు. అప్పటి నుంచి ఆలయానికి సంబంధించిన ఓ అతిథి గృహంలో పాఠశాలను నడుపుతున్నారు. మాస్టర్ ప్లాన్ పరిహారం కింద రూ.50లక్షలు, మరో రూ.14.3లక్షల మున్సిపల్ నిధులతో ఇక్కడ స్కూల్ నిర్మించారు.

గ్రామ స్వరాజ్యం కేరాఫ్ సచివాలయాలు

మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు నడుం బిగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ సేవలను ప్రజల దరికి చేర్చడంలో సచివాలయ వ్యవస్థ ప్రధాన భూమిక పోషిస్తోంది. ఇందులో వలంటీర్ల తమవంతు క్రియాశీలక పాత్రతో సచివాలయ వ్యవస్థ సేవలు ప్రజలకు త్వరితగతిన అందుతున్నాయి. గత టీడీపీ పాలనలోలా రోజులు మొదలు వారాలు, నెలల తరబడీ ప్రదక్షిణలు చేసే అగత్యం తప్పిందని ప్రజల్లో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు
- సచివాలయాల వ్యవస్థతో నూతన ఒరవడి



ముడియూరు సచివాలయ భవనం



పులికుంద్రం సచివాలయ భవనం

పిచ్చాటూరు : మండలంలో 10 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 83 మంది ఉద్యోగులు, 170మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. ప్రభుత్వ సేవలు గ్రామీణుల ముంగిటకే వెళ్లేలా సచివాలయాల సేవలను విస్తృతం చేసింది. వీటి ద్వారా మొత్తం 536 సేవలను ప్రభుత్వం అందిస్తోంది. దీంతో పల్లెలు ప్రగతి పథంలో పయనించడానికి బాటలు వేసినట్లైంది.

సేవలు సులభతరం

సచివాలయాల్లో ప్రధానంగా ఇంటి పట్టా, రేషన్‌కార్డు, మ్యుటేషన్, కుల, ఆధాయ ధృవీకరణ పత్రాలు, పోలీసు వెరిఫికేషన్, నో ఎర్నింగ్ సర్టిఫికెట్, వన్–బీ, అడంగల్, పింఛన్ దరఖాస్తు, సదరన్, ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు, కరెంటు తదితర సేవలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఒక్కరోజులోనే వందల సంఖ్యలో అర్హులకు రేషన్ కార్డులు కార్డులు ఇచ్చింది. సచివాలయాలల్లో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత సమయంలో వలంటీర్ల ద్వారా కార్డులు ఇంటికి చేరుస్తున్నారు. అలాగే ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకుంటే అర్హత ఆధారంగా 90 రోజుల్లో ఇంటి స్థలం మంజూరు చేస్తున్నారు.పింఛన్ కూడా నిర్ణీత గడువులోపు మంజూరయ్యేలా ప్రభుత్వమే ప్రత్యేక చొరవ తీసుకుంటోంది. దీంతో కార్యాలయాల్లో ప్రజలు క్యూ కట్టాల్సిన అవసరం తప్పింది.



పిచ్చాటూరులో కళ్యాణమస్తు పథకం వెరిఫికేషన్ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రదీప్ (ఫైల్)

గతంలో అర్హత ఉన్నా పథకాలకు దూరం

టీడీపీ ప్రభుత్వంలో రేషన్ కార్డు కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగేవాళ్లు. అది కూడా రెండేళ్లకోసారి కార్డులు ఇచ్చేవారు. ఈ కార్డులకు కూడా పల్స్ సర్వేకు ముడిపెట్టి అప్పట్లో కోతలు పెట్టేవారు. అలాగే ప్రజలు వారికి అవసరమయ్యే వివిధ రకాల ధృవపత్రాలు పొందాలంటే గగనమయ్యేది. ముఖ్యంగా రెవెన్యూ సంబంధిత ధృవపత్రాలు పొందాలంటే మండల కేంద్రాల్లోని మీ–సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసేవారు. ఈ దరఖాస్తులు సంబంధిత కార్యాలయాలకు వెళ్లి, అక్కడ ప్రభుత్వ అధికారుల చేత ధృవీకరించుకునేవారు. ఆ తర్వాత మళ్లీ మీ–సేవ కేంద్రాలకు వచ్చి ధృవపత్రాలను పొందేవారు. అయితే దీనికి చాలా సమయం పట్టేది. దీనిమూలాన ప్రజలు నానా అవస్థలు పడేవారు. నిరక్షరాస్యులైతే మరింత ఇబ్బంది పడేవారు. దీనికి తోడు అధికార పార్టీ నాయకుల సిఫార్సులు ఉన్నవారికి అన్నీ రకాల సేవలు అందడంతో పాటు లంచగొండితనం కూడా వివరీతంగా ఉండేది. దీంతో ప్రజలు ప్రభుత్వం సంక్షేమ పథకాలకు అర్హత ఉన్నా కూడా పొందలేని పరిస్థితి ఉండేది.



కారూరులో బయోమెట్రిక్ ద్వారా వృద్ధురాలికి ఇంటి వద్ద పింఛను ఇస్తున్న దీపిక (ఫైల్)

సచివాలయాలు అందించిన సేవలు

మొత్తం అర్జీలు సంఖ్య :	11,526 (3.5 ఏళ్లలో)
పరిష్కారమైనవి :	10,802
వివిధ కారణాలతో తిరస్కరించబడినవి :	724
పెన్షన్లు :	5,752 మందికి 1.45 కోట్లు(నెలకు)
మంజూరు చేసిన జగనన్న ఇళ్లు :	1,983
మంజూరు చేసిన రేషన్ కార్డులు :	1,905
ఆరోగ్య శ్రీ కార్డులు :	1,905
చేయూత దరఖాస్తులు :	2,108 మందికి 3.95 కోట్లు(ఏడాదికి)
వైఎస్ఆర్ ఆసరా దరఖాస్తులు :	7,342 మందికి 6.25 కోట్లు(ఏడాదికి)
ఇంటి పట్టాలు :	2,636 మందికి

కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పింది



సచివాలయ వ్యవస్థతో మాకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పింది. మాకు అందుబాటులో ఉన్న సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటున్నాం. అక్కడే 72 గంటల్లో సర్టిఫికెట్లు ఇస్తున్నారు. ఈ వ్యవస్థ ఏర్పాటు చేసిన వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– స్వామినాథన్, పిచ్చాటూరు

ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు



వలంటీర్ వ్యవస్థతో మాకు ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. గత ప్రభుత్వంలో పింఛను తీసుకోవాలన్నా మా అమ్మ పంచాయతీ ఆఫీసు కాడ రోజుల తరబడీ తిరగాల్సి వచ్చేది. జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లారక ముందే వలంటీరు ఇంటికి తెచ్చి పింఛను ఇస్తున్నారు.

– థామస్, టూటౌన్, పిచ్చాటూరు

ఆ 50 కుటుంబాలకు పెద్ద కొడుకులా...



వలంటీరుగా మా ఊరిలో 50 ఇళ్లకు సేవలందించడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం నుంచి ఏ పథకం వచ్చినా 50 కుటుంబాలను కలిసి, అర్హత ఉన్న వారిని గుర్తించి, మేలు పొందేలా చేస్తున్నా. ప్రతి నెలా ఒకటవ తేదీ ఉదయానికల్లా పింఛన్లు అందరికీ ఇస్తున్నా. దీనివల్ల ఆ కుటుంబాలు నన్ను పెద్దకొడుకులా గౌరవిస్తున్నారు. ఇది నాకు ఎంతో సంతృప్తినిస్తోంది.

– నరేష్, పిచ్చాటూరు చిన్న వీధి గ్రామ వలంటీర్

ప్రజల దరికే సేవలు



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు నా సచివాలయ పరిధిలోని ప్రజలకు చేరవేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నా. ఈ అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నా. ఉద్యోగపరంగా ప్రజలకు సేవలందిస్తున్నాననే తృప్తి సంతోషాన్నిస్తోంది.

– ప్రదీప్, వెల్ఫేర్ అసిస్టెంట్, పిచ్చాటూరు

ప్రజల నుంచి ఆదరణ



సచివాలయ వ్యవస్థకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. సచివాలయ ఉద్యోగులు వారికి అనుబంధంగా వలంటీరు వ్యవస్థ మండల ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్నారు. ఏ పథకమైనా గ్రామాల్లో అర్హులందరికీ చేరవేస్తున్నారు. పాలన ప్రజలకు చేరువైంది.

– శ్రీనివాసులు, ఎంపీడీఓ, పిచ్చాటూరు

జగనన్న ఇళ్ల నిర్మాణంపై సమీక్ష

రేణిగుంట: మండలంలోని జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిబాబు ఆదేశించారు. మండలంలోని జగనన్న ఇళ్ల నిర్మాణాలపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులతో ఎంపీడీఓ సమీక్షించారు. ఆయా పంచాయతీల పరిధిలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాల గురించి ఆరా తీశారు. నిర్మాణాలలో ఎదురవుతున్న ఆటంకాలను గుర్తించి వాటి పరిష్కార మార్గాలను గురించి వివరించారు. నిర్దేశిత లక్ష్యాలను అందుకోవడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను ఆలకిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

శ్రీకాళహస్తి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని లోక్ అదాలత్ ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు అన్నారు. పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించారు. పలువురు వినియోగదారులు తమ సమస్యలను రామ్మోహన్‌రావు, స్వతంత్ర్య సభ్యులు ఈశ్వరమ్మకు నివేదించారు. విశ్రాంత ఇంజినీర్ రామకృష్ణ తాను రెండు మండలాల పరిధిలో ఉన్న భూమిలో బోరు వేసుకుంటే సర్వీస్ ఇచ్చేందుకు పరిధిల పేరిట జాప్యం చేస్తున్నారని తెలిపారు. పలువురి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తిరుపతి ఈఈ వాసురెడ్డి, ఏడీలు సతీష్‌బాబు, శివశంకర్, ఏఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్య పరిష్కరించరూ!



సీఐ సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ముస్లిం మత పెద్దలు

రేణిగుంట: రేణిగుంట బుగ్గవీధిలోని ఇస్మాయిల్ మసీదు వద్ద పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని మండల కో–ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ ఆధ్వర్యంలో మసీదు కమిటీ పెద్దలు శుక్రవారం అర్బన్ సీఐ సుబ్బారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. అలాగే తహసీల్దార్ భార్గవి, ఇన్‌చార్జి ఎంపీడీఓ హరిబాబు, సర్పంచ్ నగేషంకు కూడా వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో మజీద్ ముతవల్లి వలిసాహెబ్, ఖాదర్‌బాషా, షాజహాన్, ఆటో బావాజాన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం: గ్రామాల నుంచి అధికారుల దృష్టికి వచ్చే ప్రతి సమస్యనూ త్వరిగతిన పరిష్కరించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదేశించారు. మండలంలోని కండ్లూరు సచివాలయ పరిధిలోని ఆదరంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ఆయా కుటుంబాల పొందిన లబ్ధి సంక్షేమ బావుటా బుక్‌లెట్లతో వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ఒక సచివాలయ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే పైవిధంగా స్పందించారు. గడప గడప మన ప్రభుత్వంలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు ఏం చేశారో తెలుసుకునేందుకు ఇకపై ప్రతి వారం సమీక్షిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. గ్రామాల్లో డ్రైడే పాటించాలని, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందాం

అనంతరం ఎమ్మెల్యే స్థానికులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోపే అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందని అన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, ఎంపీపీ మునిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు బొర్రా మాధవీరెడ్డి, నేతలు నందకుమార్, దూడల మాధవరెడ్డి, లాల్‌బాబుయాదవ్, సర్పంచ్ రాణెమ్మ, ఎంపీటీసీ పుష్ప, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటరత్నం, హేమకుమార్, సురేష్, భాస్కర్, ఎంపీడీఓ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాలేటమ్మకు వెండి కిరీటం సమర్పణ



వెండి కిరీటధారణతో పాలేటమ్మ

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు గ్రామ దేవత పాలేటమ్మకు గ్రామస్తులు పింగాణి రామస్వామిరెడ్డి, సుశీలమ్మ దంపతులు వెండి కిరీటాన్ని సమర్పించారు. శుక్రవారం అమ్మవారికి వెండి కిరీటం అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో తమ కుటుంబం బాగుందని, అందుకే రూ.1.5లక్షలతో ఈ కిరీటాన్ని చేయించామని, పర్వ దినాలలో అమ్మవారికి వెండి కిరీటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటకృష్ణారెడ్డి, వేంకటేశ్వర్లు, కాశీబాబు, విజయనాయుడు, వెంకటాచలం, వెంకటకృష్ణయ్య, శేఖర్, శ్రీనివాసులు, సుబ్బయ్య, భక్తులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం



ర్యాలీ చేస్తున్న సచివాలయ సిబ్బంది, విద్యార్థులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలని కోరుతూ తొట్టంబేడు మండలం గుండెలుగుంట గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీనియర్ పంచాయతీ కార్యదర్శి కే.ఆనందబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బడిఈడు పిల్లలు అందరూ బడికి వెళ్లాలని, పనులకు పంపరాదన్నారు. ఎవరైనా బాలల చేత పనులు చేయిస్తే కేసులు, జరిమానా ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, స్కూల్ హెడ్మాస్టర్ మధు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్లు, పూలతోటలను పెంచాలి



పనులను పరిశీలిస్తున్న ఏపీడీ సరిత

ఏర్పేడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పండ్లు, పూల తోటలను విరివిగా పెంచాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సరిత అన్నారు. శుక్రవారం మండలంలోని అంజిమేడు, ఇసుకతాగేలిలో చేస్తున్న ఉపాధి హామీ పనులను, కూలీల హాజరును ఆమె పరిశీలించారు. కూలీలను సమస్యలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతులను గుర్తించి, వారి పొలాల్లో మామిడి, సపోటా, నేరేడు, డ్రాగన్ ఫ్రూట్, కొబ్బరి, మల్లె, గులాబి, మునగ తదితర తోటల పెంపకం చేపట్టాలని సూచించారు. ఇదే విషయమై ప్రతి పంచాయతీలో రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలకు రోజు రూ.272 వచ్చేలా కొలతలు ఇచ్చి వారితో పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు మనోహర్, రవీంద్రుడు, క్షేత్ర సహాయకులు గీతాంజలి, లీలావతి, కూలీలు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి కేసులో జనసేన నాయకుడికి రిమాండ్



చంద్రబాబును సబ్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

ఏర్పేడు/శ్రీకాళహస్తి: పోలీసులపై దాడి ఘటనకు సంబంధించి నడుస్తున్న కేసులో శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వినుత భర్త కోట చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి శుక్రవారం తెలిపారు. ఏర్పేడు మండలంలోని చిందేపల్లెలో రోడ్డు సమస్య విషయంగా మార్చి నెలలో తలెత్తిన వివాదంలో చంద్రబాబు పోలీసులపై దాడి చేయడం, దీనిపై కేసు నమోదు చేయడంతో అప్పటి నుంచి పరారీలో ఉన్న చంద్రబాబును విజయవాడలో పోలీసులు అరెస్ట్ చేయడం విదితమే. శుక్రవారం శ్రీకాళహస్తి కోర్టులో అతడిని హాజరు పరచగా నిందితుడికి కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో చంద్రబాబును శ్రీకాళహస్తి సబ్ జైలుకు తరలించినట్లు సీఐ శ్రీహరి చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న మోండలెజ్ సేవ్ ద చిల్డ్రన్స్ ప్రతినిధులు

వరదయ్యపాళెం: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని మోండలెజ్ సేవ్ ద చిల్డ్రన్స్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమారి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోండలెజ్ సేవ్ ద చిల్డ్రన్స్ సంస్థ సంయుక్తంగా గోవర్ధనపురం హైస్కూల్‌లో ఉధృత అతిసారం నియంత్రణ, కిశోర బాలికల రక్తహీనత, పౌష్టికాహారం గురించి అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అతిసారం వ్యాధి లక్షణాలు, రక్తహీనత, వాటిని ఎలా అధిగమించాలో వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపినాథ్, ప్రైమరీ హెల్త్‌సెంటర్ సీహెచ్‌ఓ మధుసూదన్, పీహెచ్ఎన్ తులసమ్మ, సేవ్ ద చిల్డ్రన్స్ ప్రతినిధి తులసి, ఏఎన్ఎం సునీత తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవితే సీఎం లక్ష్యం





తొట్టంబేడు : విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న ఉన్నం వాసుదేవనాయుడు, శ్రీకాళహస్తి : తొండమనాడులో...

- 'జగనన్న ఆణిముత్యాల'కు సన్మానం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): విద్యతో ఉజ్వల భవిష్యత్తు కల్పించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి, విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఉన్నం వాసుదేవనాయుడు అన్నారు. శుక్రవారం తొట్టంబేడు మండలంలోని కన్నలి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణులైన ఎల్. ఉషారాణి (557), కె.వేణు చంద్రిక (552), ఎస్.వెంకటసాయి (533 లకు ఆణిముత్యాలు పురస్కారాలను అందజేసి వాసుదేవనాయుడు, వైస్ ఎంపీపీ మల్లికమ్మ మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు మూలాన ప్రైవేటు స్కూళ్లకంటే మిన్నగా ప్రభుత్వ స్కూళ్లు ఉంటున్నాయని, పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు ప్రేమ్ కుమార్, వెంకటేశ్వర్లు , విద్యాకమిటీ వైస్ చైర్మన్, భాస్కర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు దామోదర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొండమనాడు జెడ్పీ హైస్కూలులో..

శ్రీకాళహస్తి: విద్యతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తొండమనాడు జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని తొండమనాడు జెడ్పీ హైస్కూలులో 'జగనన్న ఆణిముత్యాలు' అభినందన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లలో చదివి అత్యుత్తమ మార్కులు సాధించి, స్కూలుకు పేరు ప్రతిష్టలు తెస్తున్నారని, తండ్రికి తగ్గ తనయగా ధృవితారెడ్డి 589 మార్కులతో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, కుప్పయ్య, సుజాత, డేవిడ్, నాగమణి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ ప్రదీప్‌కుమార్, హేమలత, దేవిప్రియ, ప్రజాప్రగతి ట్రస్ట్ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, వేడాంలో కూడా ఆణిముత్యాలు అభినందన కార్యక్రమం నిర్వహించారు.